క్రైస్తవుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్


క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

రెజిమెంటల్‌బజార్, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా వారిపై ఒత్తిడి తెచ్చి క్రైస్తవుల సంక్షేమం కోసం కృషి చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ ఎస్‌పీజీ చర్చి పారిష్ హాల్‌లో తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేసిందని, చర్చిలు, క్రైస్తవుల శ్మశానవాటికల అభివృద్ధి చేసిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ్‌నగర్‌లో ఎమ్మెల్యే ప్రచారం...

అంబర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రజలను కోరారు. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్, న్యూ ప్రేమ్‌నగర్‌లో ఆయన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పద్మారావుగౌడ్ ప్రజల మనిషి అని ప్రజలు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీసీ అభ్యర్థిని లోక్‌సభకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

భారీ మెజార్టీతో గెలిపించడం: కోకరవి

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు కోకరవి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, మహాత్మానగర్, బ్యాంక్‌ఆఫ్ బరోడా కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో గ్రాండ్ సక్సెస్

- తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు పోటెత్తిన జనం, కార్యకర్తలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన భారీ గజమాల, గాడిద గుడ్డు


సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోకు తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, సీఎం రేవంత్‌రెడ్డికి వేసిన భారీ గజమాల, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గాడిద గుడ్డు

బర్కత్‌పుర, నల్లకుంట మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల రోడ్ షో గ్రాండ్ సక్సెస్ అయింది. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం రాత్రి 7. 27 నిముషాలకు సీఎం రేవంత్‌రెడ్డి తిలక్‌నగర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేశారు. దీనిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేరింతలు కొడుతూ స్వాగతించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో రోడ్ షో నిర్వహించారు. దారిపొడవున రేవంత్‌రెడ్డికి ప్రజలు నీరాజనాలు పలికారు. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వైపు రోడ్లను మూసివేశారు. తిలక్‌నగర్ చౌరస్తా నుంచి శివం రోడ్‌ను కూడా మూసివేశారు. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద రాత్రి 8.23 నిముషాలకు ముగిసింది. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను విమర్శిస్తూ క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసిన గాడిద గుడ్డు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, గరిగంటి శ్రీదేవి, పి. జ్ఞానేశ్వర్‌గౌడ్, పులి జగన్, నారాయణస్వామి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్; మహిళా విభాగం ఖైరతాబాద్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోత రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్ కోరిన కోర్కెలను తీరుస్తా: సీఎం

మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఈ రోడ్‌షో సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని మూడు కోర్కెలను కోరగా వాటిని సీఎం ఆమోదించారు. ఛే నంబర్ చౌరస్తా వద్ద గౌతులచ్చన్న ఆడిటోరియం పనులను ఆనాడు వైఎస్ ప్రారంభించారని అది నేటి వరకు పూర్తి కాలేదని, ఈ ఆడిటోరియం పనులు పూర్తిచేయాలని, బతుకమ్మకుంటను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వచ్చే బతుకమ్మ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని, కేంద్రంలో ఏర్పడ బోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో దానంకు మంత్రి పదవి ఇవ్వాలని విన్నవించారు. దీనికి సీఎం స్పందించి ఈ మూడింటిని అమలు చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో వీహెచ్ సంతోషం వ్యక్తం చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ కృపాబజాజ్ తదితరులు

కేన్సర్ ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స సులభతరం

- సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ కృపాబజాజ్

నల్లకుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని ఆరంభంలో గుర్తిస్తే చికిత్స అందించడం మరింత సులభతరమవుతుందని గచ్చిబౌలి కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్. కృపాబజాజ్ అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా. కృపాబజాజ్ మాట్లాడుతూ ఈ నెల 12న మదర్స్ డే సందర్భంగా రొమ్ము కేన్సర్, వేసవిలో రోగులు తీసుకోవాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. 40 ఏళ్లు పూర్తయిన మహిళలకు అండాశయం, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము కేన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, ఇది గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించి కేన్సర్‌కు సంబంధించిన రక్త పరీక్షలు, స్కాన్ చేసుకుని చికిత్స పొందాలని సూచించారు. కీమోథెరపీ, రేడియో థెరపీ తీసుకునే రోగులకు వేసవిలో వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ప్రతినిధులు రంగస్వామి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


శేషగిరిరావుకు నివాళులర్పిస్తున్న ముఠా గోపాల్ తదితరులు

శేషగిరిరావుకు పలువురి నివాళి

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గన్ మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంవి.శేషగిరిరావుకు పలువురు నివాళులర్పించారు. చిక్కడపల్లి పిఅండ్‌టి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన శేషగిరిరావు సంస్మరణసభలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, వడ్డపల్లి దినేష్‌రావు, కోళ్ల సుధాకర్ తదితరులు పాల్గొని శేషగిరిరావుకు నివాళులర్పించారు. శేషగిరిరావు సోదరులు ఎంవి. శ్రీనివాసరావు, అశోక్‌కుమార్, కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గౌడ అభ్యర్థులను గెలిపించాలి

- గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకన్నగౌడ్

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో గౌడ కుల అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ కోరారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున పద్మారావుగౌడ్, భువనగిరి ఎంపీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్. బూరనర్సయ్యగౌడ్‌లను గౌడ కులస్తులతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వీరిద్దరు తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారని, వారిని ఎంపీలుగా గెలిపించాలని కోరారు. వారి గెలుపు కోసం తమ సంఘం తరపున ఓటర్లను కలిసి గెలిపించాలని ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న విరసం నేత వేణుగోపాల్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

- విరసం నేత వేణుగోపాల్

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదదాడిని ఆపాలని, శాంతి నెలకొల్పి పాలస్తీనా ప్రజల హక్కులను కాపాడుకోవాలని విరసం నేత వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదదాడి, అమెరికా యూనివర్సిటీలో విద్యార్థుల పోరాటం, పోలీసుల నిర్బంధం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ పాలస్తీనాలో మతపరంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. మదీనా, మక్కా తర్వాత ముస్లిం సమాజానికి ఆలాక్ మసీదు పవిత్రమైనదన్నారు. కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్, ప్రజాసంఘాల నాయకులు ప్రదీప్, ఎస్. నాగేశ్వరరావు, ఆజాద్, ప్రవీణ్, పృథ్వీ, నరేందర్, అనిల్, హరీష్, సీతారాం, వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు


ముషీరాబాద్‌లోని రేయిన్‌బో అనాథాశ్రమంలో సోమవారం కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
-ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మార్పీఎస్ ప్రచారం


అంబర్‌పేట డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి


గాంధీనగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం గాంధీనగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని సబర్మతినగర్, అరుంధతినగర్, వీపీ గిరినగర్ బస్తీలలో మాదిగల ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చారిజ గజ్జల రాజశేఖర్‌మాదిగ మాట్లాడుతూ తమ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కోసం జరుగుతున్న మాదిగ దండోరా ఉద్యమంలో మాదిగలకు అండగా 30 సంవత్సరాలుగా తోడుగా ఉంటున్న కిషన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేస్తున్నామని వివరించారు. మాదిగలంతా కిషన్‌రెడ్డికి ఓటు వేసి భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ ఇన్‌చార్జి ఇల్లెందుల ఎల్లయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేష్, జానకిరామచౌదరి, వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే బీజేపీలోకి చేరికలు

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే బీజేపీలోకి చాలా మంది వస్తున్నారని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. బీజేపీ నగర కార్యాలయంలో గోల్నాక డివిజన్‌కు చెందిన సతీష్, బాబురావు, ఉపేందర్, శ్రీనివాస్, సంతోష్, విక్కీలతో కలిసి దాదాపు 100 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గోల్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్. ఎన్. గౌతమ్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరొకసారి బీజేపీ ప్రభుత్వం వస్తుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్‌యాదవ్, రాంచందర్, దామోదర్‌నాయుడు, రవీందర్, ఖాజా పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన గోల్నాక బీఆర్ఎస్ నేతలను కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు

దాసరి పేరిట పురస్కారాల ప్రదానం అభినందనీయం

రవీంద్రభారతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని ఈతరం యువతకు ఆదర్శంగా నిలిచిన దాసరి నారాయణరావు జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. సోమవారం కళాదర్బార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎలిమెంట్స్ ఎలైట్ స్టూడియోలో డాక్టర్ దాసరి నారాయణరావు 77వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. నిర్మాత శివకంఠమనేనికి పురస్కారం అందజేసి సన్మానించారు. కళా సామ్రాట్ పొత్తూరి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా ప్రవీణ్‌కుమార్, ఆర్. వేంకటేశ్వరరావు, నాగజ్యోతి, వంశీరామరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. దాసరి పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. తెలుగు సినీ రంగంలో మరిచిపోలేని మహామనిషి దాసరి అని కొనియాడారు. సభకు ముందు గాయనీగాయకులచే నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. దాసరి సినిమాల్లోని గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు.


నిర్మాత శివకంఠమనేనికి పురస్కారం అందజేసిన అతిథులు

జల్సాల కోసం బైక్‌ల చోరీ

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 14 ద్విచక్రవాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న అడిషనల్ డీసీపీ టి. స్వామి, ఏసీపీ మనోజ్‌కుమార్

మదీన, మే 6 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం బైక్‌లను దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 7 లక్షల విలువ చేసే 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ టి. స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్ వివరాలు వెల్లడించారు.

బార్కస్ సలాల నబీల్ కాలనీకి చెందిన షమ్స్ హబీబ్ కుమారుడు షమ్స్ బిలాల్(26) ఆటోడ్రైవర్. మాసబ్‌ట్యాంక్ విజయ్‌నగర్ కాలనీకి చెందిన ఆర్.శ్రీనివాస్ కుమారుడు రాసూరి సుకేశ్వర్ అలియాస్ లోకేశ్ (23) ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు డబ్బు కోసం బైక్‌లను దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. పథకంలో భాగంగా నాలుగు నెలల కాలంలో సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో 14 బైక్‌లను దొంగిలించారు.

కేసు నమోదవడంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నలుగురికి జరిమానా

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసులో నలుగురు నిందితులకు సికింద్రాబాద్ రైల్వే కోర్టు జరిమానా విధించింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 12న తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన అమీర్‌ఖాన్ యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా అదే ప్రాంతానికి చెందిన సోహేల్ (25), ఫాయాజ్ (23), ఇస్మాయిల్ (28), ఆజారుద్దీన్ (25) అతడిపై దాడి చేసి రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 2 వేలు లాక్కొని పారిపోయారు. బాధితుడు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి ఎండీ గౌస్‌పాషా నిందితులకు ఒక్కొక్కరికి మూడువేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

మెసేజ్ లింక్ పంపించి రూ. 3.47 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌ను ఓపెన్ చేసిన వ్యాపారి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 3.47 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యాపారి మొబైల్‌కు ఓటీపీ నంబర్లతో కూడిన మెసేజ్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేస్తే, యాప్ ద్వారా వెబ్‌సైట్ ప్రత్యక్షమైంది. తర్వాత మీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా పిన్ నంబర్ విజయవంతంగా మారిందని సందేశం వచ్చింది. ఓటీపీ మార్చిన సైబర్ నేరగాళ్లు తర్వాత పలు దఫాలుగా అతడి ఖాతా నుంచి డబ్బులు కాజేశారు. బాధితుడికి బైజూస్, గో ఐబిబో, ఎం.షాప్ టీజీ, రమ్మీసైసి, హౌసింగ్, అమెజాన్, జెప్టాన్, ఫ్లిప్ కార్ట్‌లలో డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిందని సందేశాలు వచ్చాయి. ఇలా బాధితుడి ఖాతా నుంచి పలు దఫాలుగా రూ. 3.47 లక్షలు కాజేశారు. దాంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం నేతలు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని వారు కోరారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు అన్నారు. రాజకీయ వ్యాపారులు, దోపిడీదారులపై ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధిచెప్పాలన్నారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిందని ఆ ఓటు ఎవరికైనా వేయడానికి హక్కు ఉందన్నారు. రాజకీయ పార్టీల నేతల ప్రలోభాలకు లొంగకుండా సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దేశభక్తి కలిగి దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించే వారిని, మన దేశాన్ని ప్రపంచం ముందు ఉన్నతంగా నిలబెట్టే వ్యక్తులను గెలిపించాలని కోరారు.


10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు అందజేసిన సెయింట్ పాయిస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లిండాజరాల్డ్

క్రమశిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించేందుకు కృషి చేయాలని రాంనగర్ సెయింట్‌పాయిస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లిండాజరాల్డ్ సూచించారు. సోమవారం రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్‌లోని ఆడిటోరియంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా లిండాజరాల్డ్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు 286 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 99 శాతం ఉత్తీర్ణత సాధించారు అన్నారు. అందులో 10జీపీఏ 8 మంది విద్యార్థులకు, 9.8 జీపీఏ 8 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. 106 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, సామాజిక అంశాలు, క్రీడారంగాలలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

వైశ్య యూత్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

చిక్కడపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నారామయ్యగారి అరుణకుమార్ కార్యవర్గ సభ్యులతో కలిసి సోమవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసనిపుణులు, సంస్థ సభ్యులు జీవీఎన్ రాజు కీలక ప్రసంగం చేస్తూ ప్రతి ఏడాది సంస్థ పక్షాన పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వస్తుసామగ్రిని అందించడంతో పాటు లాప్‌టాప్‌లు బహూకరించడం చేస్తుందన్నారు. యువశక్తిని నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఉపయోగించేవిధంగా నూతన కార్యవర్గం పనిచేయాలని కోరారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ సందేశం పంపారు. కార్యక్రమంలో సంస్థాపక అధ్యక్షుడు డా.ఎర్రంశెట్టి రవికాంత్, పూర్వ అధ్యక్షుడు రాహుల్, డీఎస్‌పి గుప్తా, దివ్వెల మురళి, కస్తూరి శివప్రసాద్ పాల్గొన్నారు.


పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన చరితను అభినందిస్తున్న ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి

ఎస్ఎస్‌సీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నగర టాపర్

- ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ చరిత ఎస్ఎస్‌సీలో నగరంలోనే టాపర్‌గా నిలిచిందని హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ ఉప విద్యాశాఖాధికారి ఎం. విజయలక్ష్మి అన్నారు. ఎడ్యుకేషన్ జోన్ పరిధిలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 85 శాతం ఫలితాలు సాధించామని, మలక్‌పేట డెఫ్ అండ్ డెమ్ పాఠశాల, జీజీహెచ్ఎస్ అంబర్‌పేట, ఆజంపుర- 2 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలపారు. హైదర్‌గూడలోని సెయింట్ పీటర్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన చరిత 10/10 జీపీఏ సాధించి హైదరాబాద్ నగరంలోనే మొదటి స్థానంలో నిలిచిందని కొనియాడారు. సోమవారం డిప్యూటీ డీఈవో కార్యాలయంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శర్మ, మురళి, ఖదీర్‌ఖాన్, వేణుమాధవ్‌శర్మ, వందన, సుశీలమ్మ, సబాద్, ఇన్‌చార్జిలు శ్రీధర్‌రెడ్డి, గణేష్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362